# వలస

"యాదీ! ఇంత పొద్దుపోయినంకనానె వచ్చేది" అంది అనుసూర్యమ్మ వంటింట్లోంచే. ఎవరో వచ్చినట్లుగా పొడ కనిపించింది ఆమెకు.

"యాదమ్మను కాను దొర్సాని! సుక్కమ్మను వచ్చిన" అంది సుక్కమ్మ.

"నువ్వెందుకు వచ్చినవే. మీ అమ్మకేమైంది?" అంది అనుసూర్యమ్మ చిరాగ్గా.

"మా అమ్మకు వాంతులు జెరం దొర్సాని!" నాలుగేండ్ల తమ్ముని చంకలో ఎత్తుకొని వచ్చింది సుక్కమ్మ.

"మళ్ళా మొదలైంద కత! ఎన్నిసార్లు చెప్పిన దానికి. ఆపరేషను చేయించుకోవే అని. మనం అంటె వింటర, ఏమన్ననా!" విసుక్కుంది అనుసూర్యమ్మ."మా అమ్మకు సలిజెరం దొర్సాని! గోలి యేసుకుంటే వాంతులైతున్నయి!" అంతే అన్నట్లుగ భయంగా అంది సుక్కమ్మ.

"సరేగాని ఓ పొల్ల! వాన్నెందుకు ఎత్తుకొని వచ్చినవే. నీకే పని చాతగాదంటే వాడు ఎంబడెందుకే. హనుమంతునికి తోక లెక్క. వాడిని అక్కడ దించు. ఇగో చిన్న దొర్సాని తాతీళ్ళని వచ్చింది" అనుసూర్యమ్మ పూర్తి చేయకముందే శోభన అందుకుంది.

"తాతీళ్ళు ఏందమ్మ! సెలవులు అనరాదు" అంది. పట్నంలో శోభన హాస్టల్లో వుండి డిగ్రీ చదువుతున్నది.

"తాతీళ్ళు అన్నా సెలవులన్నా ఒక్కటె గదమ్మ. సుక్కీ! ఇగో పోరి! ఈ మీగడ తపుకు తీస్కపోయి చిన్న దొర్సాని కియ్యి" అంది అనుసూర్యమ్మ.

"తపుకు ఏందమ్మ! పళ్ళెం అనరాదు" అంది శోభన బుంగమూతి పెట్టి చిరు అలుకతో.

"అబ్బ! తపుకు పళ్ళెం ఎట్లయితదమ్మ! నువ్వు శాన చోద్యం జేస్తవ్, సరే పోరీ! ఇగో ఈ మీగడ తీస్కపోయి ఇయ్యి" అంది అనుసూర్యమ్మ.

సుక్కమ్మ చంకలో ఉన్న తమ్మున్ని కింద దించింది. దించగానే వాడు ఏడ్పు గొంతుతో గునిసాడు.

వాడు నాలుగేండ్ల వాడయినా రెండేండ్లవాడిలాగా కనిపిస్తున్నాడు. కూర్చున్నచోటు నుంచి కదలలేదు వాడు. కదిలేటందుకు కూడా వాడిలో శక్తి లేదు. వాడి పెద్ద కండ్లు తెల్లగా విప్పారి వున్నాయి. ఆ కండ్లలో బలహీనత గూడు కట్టుకున్నది.

సుక్కమ్మ మీగడ తపుకు అందుకొని అక్కడే కుర్చీలో కూర్చొని వున్న శోభన కందించింది. శోభన తపుకందుకొని సుక్కమ్మవైపు చూసింది.

సుక్కమ్మ నెత్తంతా పీచుగట్టుకొని పోయి ఎఱ్రబడింది. నూనె పెట్టి దువ్వక ఎన్ని రోజులైందో. ఎగుడు దిగుడుగా వున్న దాని పండ్లు గారపట్టి వున్నాయి. పుల్లల్లాగా వున్న చేతుల మీద మాంసం కండ అన్నది లేదు.

"కొద్దిగ నెత్తి దువ్వుకొని పండ్లు తోముకొని శుభ్రంగా వుండొచ్చు గదనే!" అంది శోభన ముక్కు ముఖం చిట్లించి.

"మా అమ్మకు జెరం చిన దొర్సాని! ఇంట్ల తీర్తలేదు నెత్తి దూసుకుందమంటె" అంది సుక్కమ్మ.

"మీ అయ్య ఎటుపోయిండె" అడిగింది అనుసూర్యమ్మ.

"మా అయ్య లేడు గద. నేత్రే ఒచ్చిండు దొర్సాని!" అంది సుక్కమ్మ.

"వాడికి పనా పాటా ! ఉప్పసతీర అట్ల పోయివస్తడు. రాత్రి కాంగనే ఫుల్లుగ తాగుతడు2' అంది అనుసూర్యమ్మ.

"తాగుతలేడు దొర్సానీ! ఆనల్లేక ఇయ్యాంకల కూలి సుత దొర్కుత లేదని మా మామ కాడికి కూలి దేవులాడుకుంట పోయిండు గద. నేత్రి ఒచ్చిండు". సుక్కమ్మకు మాట్లాడడానికి శక్తి లేకుండా వుంది.

"పోశయ్య ఏం చేస్తడమ్మ!" అడిగింది శోభన. ఆమె మునివేళ్ళతో పళ్ళెంలోంచి మీగడ తీసుకొని ముఖానికి పట్టిస్తూ వుంది.

"అమ్మా! ఇటు చూడు! నా ముఖం మీద మొటిమలు పోవడమే లేదు" అంది శోభన అద్దంలో నుంచి చూపులు తల్లివైపు తిప్పి తన చెంపల మీద మొటిమలను చూపించింది. ఆమె కళ్ళల్లో బాధ కన్పించింది.

"వాటిని గిచ్చకమ్మ! మచ్చలైతయి" అంది అనుసూర్యమ్మ కూతురువైపు ఆప్యాయంగా చూస్తూ.

"దీని తండ్రి ఏం చేస్తడమ్మ!" అడిగింది శోభన సుక్కమ్మ వైపు చూస్తూ మళ్ళా.

"పోశయ్యనా! వాడికి రెండెకరాల చెల్క వుంది. ఆముదాలో పజ్జొన్నలో పండించు కుంటడు. ఇగో గిట్లనే వానల్లేకపోతె వ్యవసాయం పనుల్లేక ఊర్లు పట్టుక తిర్గుతడు" అంది అనుసూర్యమ్మ.

"కూలికి పోతడు దొర్సాని!" అంది సుక్కమ్మ మెల్లగా.

"ఏం కూలికి పోతడే మీ అయ్య! కూలినాలి అని ఎటు పోతడో ఏందో! మన దగ్గర రెండువేలు అప్పు తీసుకుండు. రెండేండ్లయింది. అస్సలు లేదు. వడ్డి లేదు. దానికిందికే యాదిని మనింట్ల పని చేయమంటె చేస్తున్నది. దానికి పొద్దంత ఇక్కడ్నే సరిపోతది. ఇగ పోశయ్య ఏం సంపాయిస్తున్నడో పోరలకేం పెడ్తున్నడో మనకేం ఎర్క! అప్పు తీర్చే లచ్చనం

కన్పిస్తలేదు!'' అంది అనుసూర్యమ్మ. ఆమె గొంతు కర్కశంగా ధ్వనించింది. ఆమె సుక్కమ్మ వైపు చూసింది. కోపంతో ఆమె ముఖం వుబ్బిపోయి వికృతంగా కన్పించింది.

"ఎందే పోరీ! అట్ల నిలబడ్డవు! ముచ్చటంటె చెవి గోసుకుంటవ్. పనంటె చాతగాదు పో! అక్కడ రాత్రి బాసండ్లన్ని అట్లనే పడివున్నయి. తోముపో!'' కఠినంగా ఆజ్ఞాపించింది అనుసూర్యమ్మ.

"బాసండ్లు ఏందమ్మా గిన్నెలు అనరాదు'' అంది శోభన మళ్ళీ అద్దంలో తన ప్రతిబింబం మీద దృష్టి నిలిపి.

"సరే! నీతోటి మంచిగనే వుంది. నువ్వు పట్నంల వుంటున్నవ్. ఆ బాస మాట్లాడ మంటున్నవ్. అయిన ఇంకెన్నాళ్లులే! నువ్వు లగ్గం చేసుకొని ఇక్కడ్నే వుండాలె. ఇక్కడ బాస మాట్లాడాలె'' అంది అనుసూర్యమ్మ కూతురువైపు చిరునవ్వుతో చూస్తూ.

"అమ్మ! నేను చచ్చినా యీ పల్లెటూర్లో మాత్రం వుండనే'' అంది శోభన దృఢమైన గొంతుతో.

"అదేందే అట్లంటవ్. పూరాగా ఊర్లనే వుండనంటె ఎట్ల నడుస్తదమ్మ! మంకు పట్టుపడ్తె ఎట్లనమ్మ! పోచంపాడు నుంచి కాల్వ వచ్చి చెర్ల పడుతున్నది. వానల్లేక పోయినా నీళ్ళకేం కరువు లేదు. కాలు మీద కాలేసుకొని కూర్చుంటె పుట్లకొద్ది వడ్లు వచ్చి ఇంట్ల పడ్తయి. వ్యవసాయానికి తోడు వడ్లగిర్ని పెట్టిండు మీ బాపు. ఇవన్నీ విడిచిపెట్టి పట్నంల వుంటనంటె నాకెర్కలేక అడుగుత ఈ ఆస్తినంత ఎవరు జూసుకుంటరె తల్లి!'' అంది అనుసూర్యమ్మ. ఆమె గొంతులో నిరాశ చోటు చేసుకొంది.

"అదంత నాకు తెల్వదమ్మ. నేను మాత్రం యీ పల్లెటూర్లో మాత్రం వుండను. ఇక్కడేముంది! రోడ్లు లేవు. నల్లాల్లేవు. అయినా నా దోస్తులందరు పట్నంలనే వున్నరు. నేను అక్కడ్నే వుంట'' అంది శోభన. ఆమె గొంతులో వున్న మొండిపట్టును చూసి అనుసూర్యమ్మ కాస్త శాంతించింది.

"సరే! మీ బాపును నీకు పట్నం సంబంధమే చూడమని చెప్త! ఇగ మేం మాత్రం ఈ ఊర్లె పడివుంటమ! నువ్వు లేకపోతె ఆ పొలం పాలుకిచ్చి మేం పట్నంలనే వుంటం'' అంది అనుసూర్యమ్మ. ఆమె కండ్లు సుక్కమ్మను వెతికాయి.

"పోరీ! బాసండ్లు తోముడైంద లేద? పూరాగా పని దొంగలైంద్రు. ఎంబడుంటె తప్ప పన్జేయరు'' అనుసూర్యమ్మ చూపులు సుక్కమ్మ మీద పడ్డాయి.

సుక్కమ్మ తమ్ముణ్ని ఊరడిస్తున్నది. సుక్కమ్మను చూసేసరికి అనుసూర్యమ్మకు కోపం మాడకంటింది.

"ఎందే పోరీ! వాని దగ్గర చేరినవ్. ఏం గారువమే అది. ఆ పోరన్ని అక్కడ వదిలిపెట్టి మొదలు పనికానియ్'' అరిచింది అనుసూర్యమ్మ.

"ఏడుస్తుండు దొర్సాని! ఆకలైతున్నది అనికి. మా అమ్మకేమొ జెరం. పాల్లేవు. బువ్వ సరిగ్గ తినడు పెడ్తె'' అంది సుక్కమ్మ.

"సరే! ఇగో ఈ రొట్టెతునుక వాడికియ్యి" అని అనుసూర్యమ్మ ఎండిపోయిన గోధుమ రొట్టె ముక్కను సుక్కమ్మవైపుకు విసిరింది. సుక్కమ్మ రొట్టెముక్కను చేతికందియ్యగానే వాడు ఆత్రంగా అందుకొని కంకడం మొదలుపెట్టాడు. నోట్లో దనుగకపోతె మధ్య మధ్య గునుస్తున్నాడు. కాని కంకడం మాత్రం మానలేదు.

తోమి కడిగిన గిన్నెలను సుక్కమ్మ వంటింట్లోకి తెచ్చింది.

"హమ్మ! ఇప్పటికైంది నీ తోముడు" అంది అనుసూర్యమ్మ.

"దొర్సాని! ఇంకేమైన పనుందా?" అడిగింది సుక్కమ్మ మెల్లగా.

ఆ గిన్నెలన్నీ తోమినాక దానిలో ఇంకా శక్తి ఏం మిగిలిలేదు.

"లాశిగ మాట్లాడరాదే!" అంది అనసూయమ్మ కసురుతూ.

"లాశిగ అంటే ఏందమ్మ!" అడిగింది శోభన. ఆమె ముఖానికి మీగడను పట్టించి మాలిష్ చేస్తూ.

"మంచిగుందె! సొంతభాష నీకెర్క లేకుంటయితున్నది. లాశిగంటె గట్టిగ అని" అంది అనుసూర్యమ్మ కాస్త చిరాకును ప్రదర్శిస్తు.

"సుక్కమ్మ ! ఇటు రావే" అంది శోభన.

సుక్కమ్మ వంటింట్లోంచి కదిలింది. అడుగు వేయగానే దానికి చక్కరు వచ్చింది. "ఆకలైతున్నది. గందుకే పెయ్యి తిర్గుతున్నది!" అనుకుంది సుక్కమ్మ.

ఇంట్లో బియ్యం కొద్దిగా వుంటె రాత్రి ఆ బియ్యమే అన్నం వండింది సుక్కమ్మ. ఆ అన్నంలోంచి తల్లికి బలవంతంగ ఇంత పెట్టింది. చెల్లెలికింత పెట్టింది. తమ్మునికి తినిపించబోతే వాడు తినలేదు. మూతి అటుయిటు తిప్పి సుక్కమ్మను తిప్పలు పెట్టాడు. మిగిలిన అన్నం సుక్కమ్మ తిన్నది. సరిపోలేదు. అర్థాకలితోనే పండుకుంది. ఆకలితో అర్ధరాత్రి సుక్కమ్మకు మెలకువ వచ్చింది. ఇంకోవైపు చలికాలం. చలివేసింది సుక్కమ్మకు. ఇంటి మీదున్న తాటాకుల కప్పు సందుల్లోంచి చలి దూసుకొని వస్తున్నది. కప్పుకుందామంటె ఇంట్లో పచ్చురాల్లేవు. ఇంట్లో వున్న బొంతలను జ్వరంతో వణుకుతున్న తల్లి మీద కప్పింది సుక్కమ్మ. మిగిలిన గుడ్డలను చెల్లెలికి తమ్మునికి కప్పింది. ఇక సుక్కమ్మ కాళ్ళను లంగాలోకి దూర్చి కడుపు వరకు లాక్కొని చేతులను ఛాతిలోకి ముడుచుకొని మూటలా పడుకుంది. చలికి అప్పుడప్పుడు మెలకువ వస్తూ వుంది. దాంతో నిద్ర సరిపోలేదు. దానికి తోడు ఆకలి.

"మరీ రెండేండ్ల సంది ఆనల్లేక పంటల్లేక ఇంట్ల కరువొచ్చింది. అంతకుముందు చెల్కల పజ్జొన్నలు పండేయి. తల్లి కూలికి పోయేది. గింతగనం తిండికి కరువుండేది కాదు!" అనుకుంది సుక్కమ్మ. పదేండ్లయినా లేని సుక్కమ్మ చాల ఎదిగినదానిలా అయింది ఇప్పుడు.

"సుక్కమ్మ! తొందరగా రావే" గట్టిగా అంది శోభన. సుక్కమ్మ దబదబ అడుగులు

వేసింది. అది తొడుక్కున్న చీటీజాకెట్టు లంగా గిన్నెలు కడుగుతున్నప్పుడు పూర్తిగా తడిసి పోయాయి. లంగాకు ఎక్కువ కుచ్చిళ్ళు లేవు. తడిసిన లంగా సుక్కమ్మ కాళ్ళకు బంధం పడ్తున్నది. చుక్కమ్మ లంగాను కాస్త ఎత్తి పట్టుకొని ముందుకు నడిచింది.

"నీ చేతులు చల్లగా వున్నాయేమో బాగా తుడుచుకో" అంది శోభన కింద నుంచి మీదికి తడిసి వున్న సుక్కమ్మను చూసి.

తడిసిన లంగాకే సుక్కమ్మ చేతులు తుడుచుకుంది. ఆకలితో వణుకుతున్న సుక్కమ్మ తడిసిన బట్టల్లో ఇంకా వణికిపోయింది. గాజుకండ్లతో శోభన వైపు చూసింది.

"ఏంది చిన దొర్సాని!" అంది.

"ఇదో ! ఈ మీగడ తీసుకొని నా చేతులకి రాయి" అంది శోభన.

"మీగడ!" అనుకుంది సుక్కమ్మ చేతిలోకి ఇంత మీగడను తీసుకొని శోభన మోచేయి నుంచి మణికట్టు దాకా రుద్దింది.

"మీగడ! పాలు! ఆటి మొకం చూసి ఎన్ని రోజులైంది! బర్రె వున్నప్పుడు అమ్మ అమ్మంగ మిగిలిన పాలను గురిగిలో తోడుపెట్టి రాత్రి అన్నంల పోసేది. ఆనల్లేక పంటల్లేక పోయేతలకు అయ్య బర్రెను అమ్మేసిండు. మీది నుంచి అప్పు సుత అయింది. గప్పట్నుంచి పాలు మీగడ మొకం చూడనే లేదు. నేత్రి ఇంట్ల కారప్పొడి వుంటె గదె ఏసుకొని తిన్న. రాత్రంత కడుపుమంట. ఆకలి మంట. ఇంకో దిక్కు కారం మంట. మూడు కలిశి నయి" నవ్వుకుంది సుక్కమ్మ.

"బాగా బలంగా రుద్దే. బలమే లేదేంది నీకు!" అంది శోభన చిరాగ్గా.

"సుక్కీ!" పిల్చింది అనుసూర్యమ్మ ఇంకోవైపు.

"సుక్కీ! వచ్చి యీ చా తీస్కపోయి చినదొర్సానికియ్యవే!" అంది అనుసూర్యమ్మ. సుక్కమ్మ వంటింట్లోకి పోయింది.

"ఇంకా ఇండ్లు ఊడ్వాలి. తూడ్వాలి. ఈ పనులన్ని ఎప్పుడైతవే! ఇంటి ముంగల ఇంత పొద్దుపోయినంక ఊడిస్తే ఎట్లనే! ఊడ్చి సాన్పి చల్లి ముగ్గు పెట్టినవ లేద? మీ అమ్మకేమొ నాలుగు రోజులకోసారి జ్వరం. నిన్ను తోల్తది. నీకేమొ ఏండ్లు మీద పడ్డయి కాని ఏ పని చాతకాదు. నడుమ మాకు తిప్పలు. మీ అమ్మతోటి కాకపోతే మా అప్పు మాకు పారెయ్యమను. అంతేగాని ఇట్ల నడ్వదని చెప్పు. పుణ్యానికి అప్పులు కావాలె. ఎన్నేండ్లయిన తీర్పుడన్న మాట లేదు" అంది అనుసూర్యమ్మ. ఆమె కోపం పెరుగుతున్నకొద్ది గొంతు పెద్దదవుతున్నది.

పెద్ద దొర్సాని చెప్పిన పనులన్నీ వింటె సుక్కమ్మకు మరోసారి చక్కరు వచ్చింది. కండ్లల్లో నీళ్ళు తిరిగాయి. వెక్కివెక్కి ఏడ్వాలనిపించింది. తమ్ముడివైపు చూసింది. తమ్ముడింకా రొట్టె ముక్కను విడువకుండా కంకుతున్నాడు. వాడి లాలాజలం తాకి ఆ రొట్టెముక్క కాస్త మెత్త బడిందేమో. వాడు కాస్త శాంతించి ఏడ్పు మాని రొట్టెముక్కను ఏకాగ్రతతో కంకుతున్నాడు.

సుక్కమ్మ దొర్సాని అందించిన చా కప్పు అందుకుంది. "గీ ఉడుకు ఉడుకు చా నాకు దొర్సాని జర్రంత పోస్తె ఎంత మంచిగుండును!" అని సుక్కమ్మ ఆశతో నాలుక బయటికి చాపి పెదవుల కద్దుకుంది. అంతలోనే ఏమైందో ! సుక్కమ్మ కండ్లు మూసుక పోయాయి. చేతిలోని చా కప్పుతో సహా కింద కూలబడిపోయింది.

"అమ్మో చా అంత ఒలకబోసినావే! ఏమైందె పోరి అట్ల కూలబడ్డవు. ఏం నాశనగాల మొచ్చిందే? మమ్ముల్ని బద్నాం చేస్తవ ఏందే? ఈ కాలంల మీ అసొంటోల్లది రాజ్యం. ఏమన్నంటె పోలీసులు ఉరికొస్తరు. లాకప్పులంటరు. కేసులంటరు!" అరిచింది అనుసూర్యమ్మ.

ఒక చేత్తో సుక్కమ్మ చేయి పట్టుకొని పైకి గుంజి మరోచేత్తో దాని వీపు మీద గట్టిగా ఒక్క చరుపు చరిచింది అనుసూర్యమ్మ.

అప్పుడే దర్వాజా తోసుకొని గలుమ దాటి లోపలికి వచ్చిన పోశయ్య ఆ దృశ్యాన్ని చూసాడు.

"ఏమైంది దొర్సాని! గట్ల కొడ్తున్నరు పొల్లను" అని అన్నాడు పోశయ్య గొంతును పెకిలించి.

"అది పని దొంగరా. ఎట్ల కింద కూలబడ్డదో చూడు! పని తప్పిచ్చుకునెటందుకు ఎన్ని టక్కులో చూడు!" అరిచింది అనుసూర్యమ్మ.

"దొర్సాని! దాన్ని ఇడిసిపెట్టండ్రి. మేం బీదోల్లం గాని దొంగోల్లం కాదు. మాకూ ఇమానం వున్నది. పొల్లను తీస్కపోతనని ఒచ్చిన" అన్నాడు పోశయ్య ప్రశాంతంగా.

అనుసూర్యమ్మ విడిచిపెట్టగానే సుక్కమ్మ భూమ్మీద కుప్పగా కూలిపోయింది.

"ఎంత దైర్నంర నీకు! బిర్రు బాగున్నది! అప్పు తీర్సకుంట పోరినెట్ల తోల్కపోతవో నేను జూస్త!" అంది అనుసూర్యమ్మ. ఆమె కండ్లు నిప్పులు చెరుగుతున్నాయి.

"మీ అప్పు మీకు కట్టి సుక్కవ్వను తోల్కపోత. మీరేం బయపడకుండ్రి. మీతోటి కంటు పెట్టుక బతుకుతమ దొర్సాని! మా బామ్మర్ది గిన్ని పైసలిప్పించిండు. గా పైసలు కట్టె పొల్లను తోల్కపోత. ఉత్తగ ఏం పోను నేను. అప్పులు ఎగ్గొట్టెటోల్లం కాదు మేం. గది మా రగ్తంలనె లేదు. ఎన్కశీరికి ఒచ్చె బద్నాంను బరించెటోల్లం కాదు మేం. బాంచను! మా.బామ్మర్ది సెప్పిండు బొంబాయిల కాంప్లెక్సు కట్టకంల రోజు కూలి మస్తుగిస్తరంట. గక్కడికి పోయన్న బతుకుతం. రెక్కలుంటె గిన్ని పైసలు ఎన్కకేసుకొని తిరిగి ఒస్తం. మా నొష్ట రాతలు గట్లున్నయి. గీ బానిస బతుకుల తోటి ఏగలేం. పచ్చుల లెక్క గా దూరదేశం వలస బోతం. ఏం జేస్తం!" కలలో కలవరిస్తున్నట్లుగా వున్నాయి పోశయ్య మాటలు. అతని కండ్ల నుంచి ధారగా కన్నీళ్ళు కారుతున్నాయి. ఒక చేత్తో కూతురును మరో చేత్తో కొడుకును లేబట్టి ఎత్తుకొని పోశయ్య బయటికి నడిచాడు.

అనుసూర్యమ్మ శోభన గుడ్లప్పగించి చూస్తుండిపోయారు. వాళ్ళ నోట మాట రాలేదు.

ఇంటికి పిల్లలతో పోయిన పోశయ్య "ఇగ గిక్కడ ఏగలేమే మనం. అయిటికాలం ఒచ్చె పాయె. వానల్లేవాయె. ఒక దిక్కు కాలం మరో దిక్కు మడుసులు మనల్ని నెగుల నిస్తలేరు. బొంబాయికి కూలి పనుల్కు పోదం. సామానంత సదురు. లేవవే!" కోపంగా అన్నాడు పోశయ్య.

జ్వరంతో నీరసంగా వున్న యాదమ్మ లేచి కూర్చుంది. "గీ ఇల్లు గీ చెల్క గీ ఊరు ఇడిసిపెట్టి ఎక్కడికి ఎర్కలేని బొంబాయి పట్టుకపోతం. పని ఎన్కులాడుకుంట ఎక్కడ తిర్గ తం" అంది యాదమ్మ మెల్లగా.

"ఏం ఇల్లే గిది. ఆనొస్తె ఇల్లంత కురుస్తది. సలికి ఒణికిపోతుంటం. దాపులేని ఇల్లు గిది ఏం ఇల్లే! అప్పులు! అప్పులతో దొర్కిన బానిస బతుకు. బాంచెను! అన్న కని కరించెటోల్లు లేరు. ఉప్పిడి ఉపాసాలు! గవి తప్ప ఏముంది. రెండెకరాలున్నయి. కాని ఆనొస్తె పండె. లేకపోతె లేదాయె. సెప్పవే! వైనంగ ఎప్పుడన్న బువ్వ తిన్నమ? వైనంగ బట్ట కట్టినమ? గందుకే బొంబాయికి వలస పోదమంటున్న. గట్లనన్న మన బతుకులు బాగు పడ్తయేమొ? గక్కడేమైన సంపాయించుకొని గింత ఎన్కేసుకొని అయిటికాలం రాంగనె ఒచ్చి గా పైసలు పెట్టి చెల్కల బోరు ఏయించుకుందం. పంట పండించుకుందం. గప్పటి దనుక బూమి సంగతి మర్సిపో! పద! బయలుదేరు!" అన్నాడు పోశయ్య ఆక్రోశంతో.

పోశయ్య వయస్సు కన్నా ముందే ముసలివాడయ్యాడు. బస్తాల బరువులు మోసి మోసి అతని నడుము కాస్త వంగిపోయింది. చెంపలు పీక్కుపోయినయి. కండ్లు లొందలకు దిగినయి. మనిషి కాకిలాగా నల్లగా వున్నాడు. పుట్టినప్పుడు అంత నల్లగా లేడని అతని తల్లి బతికుండగా అనేది. ఎన్నోరోజుల నుంచి రోగంతో నవిసినట్లుగా బలహీనంగా వున్నాడు పోశయ్య. కాళ్ళు మోకాళ్ళ దగ్గర వంకర్లుపోయి ఉన్నాయి. రెండు పాదాలు లోపలివైపు తిరిగిపోయి వున్నాయి. కాళ్ళ బొటనవేళ్ళు మిగతా వేళ్ళతో సంబంధం లేనట్లుగా దూరంగా జరిగి వంకర తిరిగాయి. కాళ్ళ మడిమలు పగిలి పర్రెలు బాసి వున్నాయి. అతని శరీరంలో, గొంతులో పోరాడిపోరాడి అలసిపోయిన లక్షణాలు కన్పిస్తున్నాయి. కాని అతని ముఖం, ముఖంలోని కండ్లు మాత్రం ఆశ ధైర్యాలతో నిండిపోయి మెరుస్తున్నాయి.

– 'మూసీ' ద్వైవార్షిక ప్రత్యేక సంచిక,
నవంబరు-డిసెంబరు, 1999